నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | బుధవారం 8 నవంబర్ 2023 www.ntnews.com

మీకు తెలుసా?

## తెలంగాణలో పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి

| | పాలు (వందల టన్నుల్లో) | గుడ్లు (మిలియన్లలో) | మాంసం (టన్నుల్లో) |
|---|---|---|---|
| 2014-15లో | 4,20,726 | 10,618.5 | 5,05,050 |
| 2021-22లో | 5,80,778 | 16,670.8 | 10,04,950 |



■ యార్కర్



### పంట పండించిన కేసీఆర్‌కే నా ఓటు!

కూరగాయలు తెద్దామని
సోమవారం మార్కెట్కు పోయిన
ఓ రైతు అచ్చినోళ్లందరిని
పలుకరించుకుంట ఆనందంగా
కాయగూరలు అమ్ముతున్నడు.
నేను మాటల మాట గలిపి
అన్న ఈసారి ఓటెవరికేత్తున్నవ్ అన్న

**ఇంకెవరికేత్తనే నా మొఖంల నవ్వు
కనిపిస్తలేదా?
ఆ నవ్వుకు కారణమైనోళ్లకే ఏత్త
అన్నడు..
ఓ కేసీఆర్కేనా నీ ఓటు అనంగనే
సంబురంగా మరి గాయనకుగాక
ఇంకెవరికేత్తా అన్నడు..**

మరి కాంగ్రెస్, బీజేపోళ్లకు ఎయ్యవా..
వాళ్లుగూడ కేసీఆర్ కంటే
మంచిగ చేస్తాం అంటున్నరు గదా అన్న..

**నువ్వెందుకచ్చినవ్ అని అడిగిండు..
టమాటలు కొనేతందుకు అని అన్నా..
కింద పుచ్చుపట్టిన టమాటలున్నయ్
ఫ్రీగా తీసుకపోతవా అని అడిగిండు..**

ఏయ్ గవ్వి నాకెందుకు అన్న..

**గిదిగూడ గంతే తమ్మీ..
మనకు మంచి చేసేటోళ్లు ఉండగా
నేను అది జేస్తా.. ఇది జేస్తా..
అనుకుంట
పుచ్చుమాటలు చెప్పేటోళ్లు మనకెందుకు
తమ్మీ
కాంగ్రెసోడు అత్తే మళ్ల మంచమేసుకొని
బోర్లకాడ పండాలె
బీజేపోడు అత్తే మోటర్లకాడ మీటర్లని
చార్జీలతో సంపుతడు
ఇప్పుడు 24 గంటల కరెంటు రానేవట్టే..
పంటపంటకూ పెట్టుబడి.. ఎరువులు..
ఇట్లా మాకు గావాల్సిన సౌలతులన్నీ
కేసీఆర్ జెయ్యనేవట్టే..
ఇంకెందుకు తమ్మీ గా పుచ్చిపోయిన
ప్రతిపక్షపోళ్లు మనకు**

చివరగా ఒక్క మాట చెప్పన్నా,
కేసీఆర్ సారు సాగుచేసిన పంట
చేతికొచ్చింది..
ఆ పంట నోటికందాలంటే మనం
ఆయనెంటే ఉండాలే!
లేకుంటె మన బతుకు మళ్లా పడావే
అన్నడు!!

(ఎంత మంచి మాట.. విశ్వాసం అంటే
ఇట్లా ఉంటది..
కేసీఆర్ చేసిన మంచి అనుభవించినోళ్లకే
తెలుస్తది)

-రాజు అతికం



### రేవంత్ ఇల్లు ఏమైతుండెనో

**పీఏ:** సార్ మీరు పోలీసోళ్లను తిట్టుడు ఆపెయ్యాలి
**రేవంత్:** ఎందుకయ్యా.. వాళ్లను తిట్టుడు గిట్ల రాజకీయమే. నీకు తెల్వదు
**పీఏ:** కాదు సార్. పోలీసోళ్లు మనకు చాలా పెద్ద సాయం చేసిన్రు
**రేవంత్:** ఏందయ్యా ఆ సాయం
**పీఏ:** వాళ్లు లేకపోతే మీ ఇల్లు ఏమవుతుండెనో ఇయ్యాల
**రేవంత్:** ఏమయ్యిందయ్యా నా ఇంటికి ?
**పీఏ:** మనం మంచిగనే హెలికాప్టర్ ఎక్కి తిరుగుతున్నం గని హైదరాబాద్ల మీ ఇంటిని పోలీసోళ్లే కాపాడిన్రు.
**రేవంత్:** ఎందుకయ్యా
**పీఏ:** మీరేమో టికెట్లు ఇస్తమని లీడర్లతోటి కోట్లు ఖర్చు పెట్టిచ్చిన్రంట. ఇప్పుడేమో కొత్తగొచ్చినోల్లకు టికెట్లు ఇచ్చిన్రు కదా.
**రేవంత్:** ఆ లెక్కలు వేరే ఉన్నయిలే నీకు తెల్వదు.
**పీఏ:** టికెట్లు రానోళ్లు మీ ఇంటిమీదికి దాడికొచ్చిన్రు.
**రేవంత్:** అవునా.
**పీఏ:** అవును సార్. టైంకు పోలీసోళ్లు వచ్చి వాళ్లను అరెస్టు చేయకపోతే మీ ఇల్లు ఏమైతుండెనో.
**రేవంత్:** అయినా సరే పోలీసోళ్లను తిట్టక తప్పదయ్యా.
**పీఏ:** ఎందుకు సార్ ?
**రేవంత్:** ఎలక్షన్ల టైంల పోలీసులు వేధిస్తున్నరని చెప్పకపోతే సింపతీ వర్కౌట్ కాదయ్యా.

-వరుణ్

# కీస నిండా కాసులతో..

బిగ్ స్టోరీ

## ఆర్థికంలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

కీసలో కాసులుంటేనే మొకం తెలివి! మనిషికైనా, రాష్ట్రానికైనా, దేశానికైనా.. ఎవరికైనా ఇదే లెక్కాపత్రం! దేశంలో అతి తక్కువ వయసున్న రాష్ట్రం మనది.. భౌగోళికంగా తెలంగాణది 11వ స్థానం.. జనాభా పరంగా చూస్తే 12వ స్థానం... అయితేనేం, అనుకున్నడు మన సీఎం కేసీఆర్. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆర్థిక రంగంపై దృష్టి పెట్టి 'సిరిగల్ల రాష్ట్రంగా శిఖరాగ్రాన నిలబెట్టేందుకు తనదైన చిట్టాపద్దులు రచించారు. ఫలితంగా ఎన్నో ఏండ్ల చరిత్ర కలిగిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది తెలంగాణ.. అతిపెద్ద రాష్ట్రాలకు సైతం ఆర్థిక పాఠాలు బోధిస్తున్నది మన రాష్ట్రం. తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్ స్థానం. రాష్ట్ర తలసరి ఆదాయం తొమ్మిదేండ్లలోనే 3 రెట్లు పెరిగింది. 156 శాతం వృద్ధిని సాధించి దేశానికి అందనంత ఎత్తుకు ఎదిగింది మన రాష్ట్రం. జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,45,115 ఎక్కువ. దేశంలోని అనేక రాష్ట్రాల్లోని తలసరి ఆదాయం దీనికంటే తక్కువే!

- ఆస్తుల కల్పనలో తెలంగాణదే అగ్రస్థానం
- తలసరి ఆదాయంలో మనమే నంబర్ వన్
- 1.24 లక్షల నుంచి 3.17 లక్షలకు పెరిగిన ఆదాయం
- తొమ్మిదేండ్లలో తలసరి ఆదాయం 156 శాతం వృద్ధి
- 186 శాతంతో మూడు రెట్లు పెరిగిన జీఎస్డీపీ
- 4.51 లక్షల కోట్ల నుంచి 12.93 లక్షల కోట్లు
- దేశ జనాభాలో మన వాటా 2.89 శాతం.. జీడీపీలో మన వాటా 4.7 శాతం

### అతితక్కువ సమయంలో భారీగా జీఎస్డీపీ వృద్ధి

దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.89 శాతం. కానీ.. దేశ జీడీపీ (స్థూల దేశీయ ఉత్పత్తి)లో తెలంగాణ వాటా 4.7 శాతంగా ఉండడం విశేషం. దేశంలోని మిగతా రాష్ట్రాలు అక్కడి జనాభాతో పోలిస్తే ఎంతో తక్కువ శాతం జీడీపీ వాటాను కలిగి ఉన్నాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్డీపీ (స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి) రూ.4,51,580 కోట్లు. 2022-23లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.12,93,469 కోట్లు. అంటే.. తొమ్మిదేండ్లలోనే రాష్ట్ర జీఎస్డీపీ రూ.8,41,889 కోట్లు పెరిగింది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ అతితక్కువ సమయంలో ఇంత భారీగా జీఎస్డీపీ వృద్ధి జరగలేదు.



| తెలంగాణ తలసరి ఆదాయం | దేశ తలసరి ఆదాయం |
|---|---|
| 2014-15వ ఆర్థిక సంవత్సరంలో రూ.1,24,104 | 2014-15వ ఆర్థిక సంవత్సరంలో రూ.86,647 |
| 2022-23వ ఆర్థిక సంవత్సరంలో రూ.3,17,115 | 2022-23వ ఆర్థిక సంవత్సరంలో రూ.1,72,000 |
| తొమ్మిదేండ్లలో సాధించిన వృద్ధి 156 శాతం | తొమ్మిదేండ్లలో సాధించిన వృద్ధి 98 శాతం |



ఏ లక్ష్యంతోనైతే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామో ఆ దిశగా తెలంగాణ పరుగెడుతున్నది. తెలంగాణ ఉద్యమ నినాదమైన 'నీళ్లు, నిధులు, నియామకాలు' అన్నింటినీ కేవలం తొమ్మిదేండ్లలోనే సాకారం చేసుకున్నది. అందులో.. అత్యంత ప్రధానమైన అంశం నిధులు. మిగతా రెండింటిని సాకారం చేసుకోవడంలో నిధుల పాత్రే ఎంతో కీలకం. అయితే.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేనాటికి తెలంగాణ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే! అందుకే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆర్థిక రంగంపై దృష్టి సారించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఏమిటి? రాబడి ఎంత? ఖర్చులేంటి? వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సంపదను సృష్టించి ప్రజలకు పంచి.. ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేందుకు కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆర్థిక రంగంపై కేసీఆర్ మార్క్ తొలి ఏడాది నుంచే కనిపించడంతో అతి తక్కువ సమయంలో సుసంపన్న రాష్ట్రంగా అవతరించింది. దేశంలో అనేక పెద్ద రాష్ట్రాలను సైతం వెనక్కి నెట్టి అగ్రస్థానా నికి ఎగబాకింది. దశాబ్దాల చరిత్ర కలిగిన రాష్ట్రాలకు ఆర్థిక వృద్ధిలో పాఠాలు బోధించే స్థాయికి ఎదిగింది. 'తెలంగాణోళ్లకు ఏమొస్తది? వాళ్లకసలు పరిపాలించడమే చేతకాదు' అన్న నోళ్లతోనే 'తెలంగాణను చూసి నేర్చుకోండి.. కేసీఆర్ ది గ్రేట్' అనే స్థాయికి చేరింది.

### 'తలసరి'లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్...

తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్ స్థాయికి ఎదిగింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు 2014-15వ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104 మాత్రమే. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,17,115. అంటే తొమ్మిదేం డ్లలో తలసరి ఆదాయంలో తెలంగాణ కనీవినీ ఎరుగని వృద్ధిని నమోదు చేసింది. అతి తక్కువ సమయంలోనే తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. 156 శాతం వృద్ధిని సాధించింది. కేవలం.. తొమ్మిదేండ్లలోనే తలసరి ఆదాయం రూ.1,93,011 పెరిగింది. దేశంలో అతి తక్కువ సమయంలో ఇంత భారీగా తలసరి వృద్ధి సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. తలసరి వృద్ధిలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎంతో మెరుగ్గా ఉన్నది. 2014-15లో దేశ తలసరి ఆదాయం రూ.86,647 ఉంటే 2022-23లో రూ.1,72,000 మాత్రమే. తలసరిలో జాతీయ వృద్ధి 13.7 శాతం ఉండగా, తెలంగాణ మాత్రం 15.1 శాతంతో గణనీయమైన వృద్ధిరేటును నమోదు చేసిం ది. అంటే, దేశం కంటే 1.4 శాతం అధిక వృద్ధిని సాధిం చింది. దేశంతో పోల్చినా, దేశంలోని అనేక రాష్ట్రాలతో పోల్చినా.. తెలంగాణ ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదిగింది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చుకుంటూ.. ఏటికేడు బలమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తున్నది.

### జీడీపీ/జీఎస్డీపీ సేకరణ ఇలా...

ఒక దేశంగానీ.. రాష్ట్రంగానీ అభివృద్ధి చెందిందని చెప్పేందుకు తలసరి ఆదాయాన్ని గీటురాయిగా తీసుకుంటారు. తలసరి ఆదాయ వృద్ధిరేటు ఆ దేశ, రాష్ట్ర అభివృద్ధి ప్రగతికి సూచీగా నిలుస్తుంది. జీడీపీ (స్థూల దేశీయ ఉత్పత్తి)/జీఎస్డీపీ (స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి)ని వ్యవసాయం, తయారీ రంగం, విద్యుత్, గ్యాస్ పంపిణీ, గనుల తవ్వకం, అడవులు, చేపల వేట, హోటల్, నిర్మాణం, సమాచార సంబంధాలు, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, బీమా, వాణిజ్య సేవలు, సామాజిక రంగం, ప్రజాసేవలు తదితర రంగాల నుంచి సేకరిస్తారు. దేశం లేదా రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందిందా? లేదా మందగమనంలోకి వెళ్తుందా? అని నిర్ణయించడంలో జీడీపీ/జీఎస్డీపీనే కీలకం. జీడీపీ వృద్ధి చెందుతుందంటే ఆ దేశం లేదా రాష్ట్రం ఆర్థికం, సంక్షేమం, అభివృద్ధిలో పురోగమిస్తుందని అర్థం. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఏవైనా ఒక ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలన్నా? ఒక పరిశ్రమ లేదా కంపెనీని స్థాపించాలన్నా? ఆ దేశ లేదా రాష్ట్ర జీడీపీనే ప్రామాణికంగా తీసుకుంటాయి. అనతికాలంలోనే ప్రపంచ దిగ్గజ కంపెనీలన్నీ తెలంగాణకు రావడంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధిదే ప్రధాన పాత్ర.

### వాణిజ్య పన్నుల్లో మనమే ఆదర్శం..

| ఆర్థిక సంవత్సరం | బడ్జెట్ అంచనా | రాబడి | శాతం |
|---|---|---|---|
| 2018-19 | 34,232 | 28,786 | 84 |
| 2019-20 | 31,186 | 28,053 | 90 |
| 2020-21 | 32,671 | 25,905 | 80 |
| 2021-22 | 35,520 | 34,489 | 97 |
| 2022-23 | 42,189 | 51,870 | 123 |

### ఐదేండ్లలో జీఎస్టీ 125 శాతం వృద్ధి...

దేశ ఆర్థిక రాజధాని ఉన్న మహారాష్ట్ర, దేశానికే రోల్‌మోడల్ అని బీజేపీ పదేపదే వల్లె వేస్తున్న గుజరాత్ కంటే తెలంగాణ జీఎస్టీ రాబడిలో కనీవినీ ఎరుగని వృద్ధిని సాధించింది. ఐదేండ్లలోనే జీఎస్టీ వసూళ్లలో 125 శాతం వృద్ధిరేటును నమోదు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వాణిజ్య పన్నుల శాఖను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు స్వయంగా పర్యవేక్షించారు. ఆయన మార్గదర్శనంలో ఎన్నో కొత్త సంస్కరణలు ప్రవేశపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా అనేక సర్కిళ్లు ఏర్పాటు చేశారు. ప్రతిస్థాయిలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. మాన్యువల్ నోటీసులు, ప్రొసీడింగ్‌ల జారీని పూర్తిగా తొలగించారు. శాఖాపరమైన పరిశోధనలు, విశ్లేషణల కోసం ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి ఎన్నో గొప్ప సంస్కరణలతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగు పడింది. వ్యాపారాలు అద్భుతంగా అభివృద్ధి చెందాయి. ఫలితంగా.. జీఎస్టీ రాబడి అనూహ్యంగా పెరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో రూ.28,786 కోట్ల జీఎస్టీ వసూలు అయ్యింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.51,870 కోట్ల జీఎస్టీ రాబడి వచ్చింది. అంటే.. ఐదేండ్లలో జీఎస్టీ ఆదాయం రూ.23,084 కోట్లు పెరిగింది. సీఎం కేసీఆర్ సారథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా మారింది. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ పనితీరును, గొప్ప సంస్కరణలను అధ్యయనం చేసేందుకు గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌తోపాటు అనేక రాష్ట్రాలు రాష్ట్రంలో పర్యటించాయి. ఇక్కడి విధానాలను ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయి.

### ఆస్తుల కల్పనలో మనమే టాప్

ఏ దేశమైనా, రాష్ట్రమైనా ఆర్థికంగా బలపడాలంటే మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) ఎంతో ముఖ్యం. ఇంత ప్రాముఖ్యమున్న మూలధన వ్యయంలో, సంపద సృష్టిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన నాటి నుంచే మూలధన వ్యయంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దీనివల్లే.. అనతికాలంలోనే తెలంగాణ తిరుగులేని ఆర్థిక శక్తిగా ఎదిగింది. తెలంగాణ ఏర్పడినప్పుడు... 2014-15వ ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం రూ.8,097 కోట్లు. తొమ్మిదేండ్లలోనే అది రెట్టింపు స్థాయిని మించిపోయింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ మూలధన వ్యయం కింద ఖర్చు చేసింది రూ.18,007 కోట్లు. అంటే.. తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో మూలధన వ్యయం రూ.9,910 కోట్లు పెరిగింది. దేశంలోని మరే రాష్ట్రంలో అతితక్కువ సమయంలో ఇంత భారీ మొత్తంలో మూలధన వ్యయం కింద వెచ్చించలేదు.

### తొమ్మిదేండ్లలో తెలంగాణ, జాతీయ తలసరి ఆదాయాలు ఇలా (ప్రస్తుత ధరల ప్రకారం రూ.లలో)

| సంవత్సరం | తెలంగాణ | వృద్ధిశాతం | దేశం | వృద్ధిరేటు(శాతం) |
|---|---|---|---|---|
| 2014-15 | 1,24,104 | 10.6 | 86,647 | 9.5 |
| 2015-16 | 1,40,840 | 13.5 | 94,797 | 9.4 |
| 2016-17 | 1,59,395 | 13.2 | 1,03,870 | 9.6 |
| 2017-18 | 1,79,358 | 12.5 | 1,15,224 | 10.9 |
| 2018-19 | 2,09,848 | 17.0 | 1,25,946 | 9.3 |
| 2019-20 | 2,31,378 | 10.3 | 1,32,115 | 4.9 |
| 2020-21 | 2,31,103 | -0.1 | 1,26,855 | -4.0 |
| 2021-22 | 2,75,443 | 19.2 | 1,50,007 | 18.3 |
| 2022-23 | 3,17,115 | 15.1 | 1,72,000 | 13.7 |



### దేశ జీడీపీలో తెలంగాణది పెద్దన్న పాత్ర...

ఆర్థిక వృద్ధిలో తెలంగాణ జెట్ వేగంతో దూసుకెళ్తున్నది. పెద్ద రాష్ట్రాలను వెనక్కి నెట్టి రికార్డులు సృష్టిస్తున్నది. రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ జీఎస్డీపీ స్థిరంగా పెరుగుతూనే ఉన్నది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్డీపీ రూ.4,51,580 కోట్లు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.12,93,469 కోట్లకు ఎగబాకింది. అంటే, తొమ్మిదేండ్లలోనే జీఎస్డీపీ మూడురెట్లు పెరిగింది. గణనీయంగా 186 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. తొమ్మిదేండ్లలో జీఎస్డీపీ రూ.8,41,889 పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ రూ.2,72,03,767 కోట్లు. అంటే, దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.7 శాతం. ఎన్నో పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే.. జీడీపీలో తెలంగాణ వాటానే ఎక్కువ. చివరికి, కరోనా విపత్తు సమయంలోనూ జాతీయ సగటును మించి జీఎస్డీపీలో వృద్ధిని నమోదు చేసింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఒకవైపు కరోనా కాటేస్తున్నా, కేంద్రం ఏకాణా ఇవ్వకున్నా వెనుదిరిగి చూడలేదు. ఆ సమయంలో దేశ జీడీపీ -1.4 శాతానికి పడిపోగా, తెలంగాణ మాత్రం 1.2 వృద్ధిరేటును నమోదు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దేశ జీడీపీలో తెలంగాణ పెద్దన్న పాత్ర పోషిస్తున్నది.

### జీడీపీలో తెలంగాణ వాటా 4.7 శాతం (రూ. కోట్లలో...)


| ఆర్థిక సంవత్సరం | తెలంగాణ | దేశం | తెలంగాణ వాటా (శాతాల్లో) |
|---|---|---|---|
| 2013-14 | 4,51,580 | 1,12,33,511 | 4.0 |
| 2014-15 | 5,05,849 | 1,24,67,959 | 4.1 |
| 2015-16 | 5,77,902 | 1,37,71,874 | 4.2 |
| 2016-17 | 6,58,325 | 1,53,91,669 | 4.3 |
| 2017-18 | 7,50,050 | 1,70,90,042 | 4.4 |
| 2018-19 | 8,57,427 | 1,88,99,668 | 4.5 |
| 2019-20 | 9,48,356 | 2,00,74,856 | 4.7 |
| 2020-21 | 9,69,656 | 1,98,00,914 | 4.9 |
| 2021-22 | 11,54,846 | 2,36,64,639 | 4.9 |
| 2022-23 | 12,93,469 | 2,72,03,767 | 4.7 |

### మూలధన వ్యయంలో మనమే రోల్ మోడల్ (రూ. కోట్లలో...)

| ఆర్థిక సంవత్సరం | బడ్జెట్‌లో ప్రతిపాదన | మూలధన వ్యయం | బడ్జెట్ ప్రతిపాదనల్లో శాతం |
|---|---|---|---|
| 2014-15 | 15,101 | 8,097 | 53.62 |
| 2015-16 | 15,982 | 13,631 | 85.29 |
| 2016-17 | 29,313 | 36,955 | 126.07 |
| 2017-18 | 30,929 | 26,144 | 84.53 |
| 2018-19 | 33,369 | 22,909 | 68.65 |
| 2019-20 | 17,274 | 17,085 | 98.90 |
| 2020-21 | 22,061 | 16,181 | 73.35 |
| 2021-22 | 29,046 | 29,104 | 100.20 |
| 2022-23 | 29,728 | 18,007 | 60.57 |

... సూర్యకిరణ్ తోగటి

■ లీలా మహత్యం



## డామిట్.. కథ అడ్డం తిరిగింది!

నారాయణపేట జిల్లాలో ఓ కాంగ్రెస్ నేతకు ఎలక్షన్లు అచ్చొస్తలేవు.. టికెట్లు ఇచ్చే సమయానికి సరిగ్గా ఆ నేత టైమ్ బ్యాడ్ అయిపోతుంది.. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీకి దిగాలని ప్రయత్నించినా చివరి నిమిషంలో ఆ పార్టీ హ్యాండ్ ఇచ్చి బీసీ నేతకు టికెట్ ఇచ్చింది. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని బీరాలు పలికి నామినేషన్ సైతం వేశారు. ఏమైందో ఏమో కానీ.. చివరి నిమిషంలో విత్‌డ్రా చేసుకున్నాడు. 2014 వచ్చేసరికి పార్టీ మారి పోటీకి దిగారు. సేవా కార్యక్రమాలు అంటూ ఊదరగొట్టినా జనం నమ్మలేదు. సొంత పార్టీనే మోసం చేయాలనుకొని చతికిలపడ్డాడు. 2018లో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఓ మాజీ మంత్రిని పట్టుకుని టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా అది బెడిసికొట్టింది. తనకే వస్తదనుకున్న టికెట్‌ను మరొకరు ఎగరేసుకుపోవడంతో మళ్లీ నిరాశే మిగిలింది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పార్టీ బహిష్కరణ.. అవీ ఇవీ.. అన్నీ అయిపోయి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఏమైందో ఏమో కానీ మున్సిపల్ ఎన్నికలకు పార్టీ పరిశీలకురాలిగా వచ్చిన ఓ మహిళా నేతతో రాసలీలల వ్యవహారం నెరిపి పార్టీ కొంపముంచారు. అయినా, ఆ పార్టీ అతడికి జిల్లా బాధ్యతలు అప్పగించింది. ఈలోగా సదరు మహిళ 'తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు' అంటూ కేసు పెట్టి హంగామా చేసింది. పార్టీ పరువు బజారున పడడంతో అధిష్ఠానం ఉన్న పదవిని ఊడబీకి పార్టీ నుంచి బహిష్కరించింది. కొన్నాళ్లు దూరంగా ఉన్న సదరు నేత మళ్లీ అధిష్ఠానం కాళ్లావేళ్లా పడి తనపై బహిష్కరణ వేటును తొలగింపజేసుకొని ఎన్నికలకు సిద్ధమవుతుండగా, ఈ సారి పోలీసు కేసు రూపంలో దురదృష్టం ఎదురైంది. ఈడగాదు ఆడగాదు ఏకంగా బెంగళూరు ఠాణాలో కేసు నమోదు కావడంతో పార్టీ పెద్దలు అతడికి టికెట్ నిరాకరించారు. దీంతో 'డామిట్, కథ అడ్డం తిరిగింది'.. అంటూ నిట్టూరుస్తున్నాడు!

... వెంకటేశ్వర్‌రావు